# నాగభూషణంగారి సీత

బెన్నిబాబు నాకంటే పెద్దోడు.

ఆడిల్లు మాలపేటలో.

మా ఇల్లు దేవాంగుల పేటలో.

మా ఇద్దరికీ స్నేహం ఎలా కుదిరిందో గుర్తులేదుగానీ చాలా గట్టిగానే కుదిరింది. నేను ఆ పసలపూడిలో ఉన్నంతకాలం నన్ను కలవకుండా ఏరోజూ ఆడుండలేదు.

రామచంద్రపురంలో స్టేట్‌బేంక్ ముందున్న ఉదయలక్ష్మీ నర్సింగ్‌హోమ్‌లో కాంపౌండర్‌గా పనిచేసే బెన్నిబాబు డ్యూటీ అయిపోయాకా నా దగ్గర కొచ్చేసేవాడు.

ఆవేళకూడా వచ్చేడు.

అప్పటికి రాత్రి తొమ్మిది దాటింది.

పిచ్చితాతారెడ్డి సైకిలు షాపులో అద్దెసైకిలు తీసుకొచ్చిన బెన్నిబాబు నన్ను వెనకాల కూర్చోబెట్టుకుని రామచంద్రపురం హైస్కూలు గ్రౌండులోకి తీసుకెళ్ళేడు.

కటిక చీకటి. నరమానవుడు లేడక్కడ. గ్రౌండుకి ఆ చివర్నున్న చెరకుతోటల్ని ఆన్చిఉన్న తాటాకుపాకలో గుడ్డిదీపం వెలుగుతుంది. ఆ తోటలకి కాపలా ఉండే పిల్లినాగన్న పాకది. చిన్నప్పుడు కాస్త కుష్ఠు రావడం వల్ల వేళ్ళు మట్టుకి వంగిపోయిన పిల్లినాగన్నతో పాటు రత్నం అనే కర్ర శరీరంగల మనిషికూడా ఉంటుందాపాకలో.



సైకిలుస్టేండేసి లోపలికొచ్చిన చిన్నిబాబుని చూడగానే ''రండి అబ్బాయిగారూ!''అన్నాడు నాగన్న.

జేబులోంచి రెండురూపాయలు తీసిచ్చేడు బెన్నిబాబు. దాంతో మరింత అయిసయిపోయేడు నాగన్న. ముక్కాలిపీట జరిపి కూర్చోండన్న రత్నం నన్ను చూసి ''ఈ అబ్బులుగారెవరండీ?'' అంది.

''మావూరేలే'' అన్నాడు బెన్నిబాబు.


కాస్సేపటికి బోదికాలవ అవతల మువ్వలపట్టాల చప్పుడు విన్న పిల్లినాగన్న ''ఇయ్యాల ఏవయిందో పాపగారు కొంచెం లేటుగా దిగుతున్నారు'' అన్నాడు.

నవ్విన బెన్నిబాబు ఆ పట్టాల చప్పుడే వింటున్నాడు.

కొంచెం సేపటికి చప్పుడు మరీ దగ్గరయ్యింది. చీకట్లో ఉన్న ఒక అమ్మాయి లాంతరు వెలుగులో కొచ్చి నిలబడింది. వయసు ఒక పాతికుంటది. పేరుసీత. గోదారవతల ముమ్మిడివరం దగ్గరున్న కొమానపల్లి వాళ్ళది. పిల్లలు లేని ఈవూరి నాగభూషణంగారు ఆ వూరోళ్ళ దగ్గర్నించి దత్తత తీసుకున్నారు సీతని. అప్పుడప్పుడూ వాళ్ళూరెళ్ళి కన్న తల్లిదండ్రుల్ని చూసొస్తుందట సీత.

సీతలో అసలు అందం. తన సెవరగంతమీదున్న ఆగాటు వల్ల వచ్చింది. చిన్నప్పుడు ఆళ్ళ ఆవు కొమ్ము విసిరిందట. గాయం మానినా గాటు మిగిలిపోయిందంట.

బెన్నిబాబూ సీతా కల్సి చెరుకుతోటలో కెళ్ళిపోయేక తన కతలు చెప్పడం మొదలెట్టేడు పిల్లినాగన్న.



ఎనకటికెప్పుడో తనకి చాలా పొలాలుండేవంట. పొలాల మధ్య సారా బట్టీ పెడితే పోలీసులొచ్చి చితగ్గొట్టేరంట. ఎదవకతలూ ఎదవగోల వినలేక చచ్చిపోతన్నాను.

* * *

కాకినాడ పూలవంతెన దగ్గర బస్సు దిగేటప్పటికి చీకటి పడ్తుంది. అప్పుడే ఆరు దాటేసింది.

నారెక్క పుచ్చుకుని గబగబా నడుచుకుంటా వంతెన కుడి పక్క కెళ్లేడు బెన్నిబాబు.

కొంచెం దూరం నడిచి ఎడం పక్కకి తిరిగేటప్పటికి స్వప్న దియేటర్ కనపడింది.

“పద లోపలకి” అన్నాడు బెన్నిబాబు.

“ఎవరింటికో వెళ్దామని ఈ సినేమా హాల్లోకి తీసుకొచ్చేవేంటి?” అన్నాను.

“రా తర్వాత చెప్తాను” అని లోపలికి లాక్కెళ్ళి టిక్కెట్లుకొని హాల్లోకి తీసుకెళ్లేడు. ఈ మధ్యే కట్టేరట ఆ హాలు. ఏదో హిందీ సినేమా ఆడతంది. లోపలంతా చల్లటి ఇగణం లాగుండేసరికి ఎప్పుడూలేంది మాగన్నుగా పట్టేసింది నిదర.

సినేమా అయిపోయినట్టుంది నన్ను నిద్రలేపి బయటికి లాక్కొచ్చి రిక్షా ఎక్కించేడు.

"ఎవరింటికో వెళదావన్నావ్ గదా?" అన్నాను.

"ఉండెహె మధ్యాన్నించి ఎదవగోల"అని నన్ను తిట్టి "తిన్నగా ఎళ్ళు" అన్నాడు రిక్షావాడితో.

ఇంద్రపాలెం లాకుల దగ్గరాగింది రిక్షా. ఇంకా ముందుకెళ్ళమన్నాడు బెన్నిబాబు. ముసలమ్మగుడి దాటి బాగా ముందుకెళ్ళేక చిన్న కోటలాంటి ఇల్లు కనపడింది. పాతకాలం నాటి రాజుల ఇల్లది.

రిక్షాని ఆగమని వాడికి డబ్బులిచ్చి పంపించేసేకా ఆ ఇంటిదొడ్డి గుమ్మం దగ్గర నిలబడ్డాడు బెన్నిబాబు. పక్కనే నేను.

ఎవరికోసమో చూస్తున్న బెన్నిబాబుతో "ఎవరింట్లోకి వెళదావన్నావ్" అన్న నా మూతి మీదొకటేసేడు.

కాకినాడని ఆన్చి ఉన్న ఆ ఇంద్రపాలెం హాయిగా నిద్రోతుంది. దూరంగా ఎక్కడ్డో సూడికుక్క అరుపులు. సామర్లకోటెళ్ళేరోడ్డు మీంచెళ్ళే లారీ హారను మోతలు తప్ప వాతావరణమంతా హాయిగా ఉంది.

కాస్సేపటికి.

ఆ చీకట్లో కల్సిపోయేలాగ నల్లచీర కట్టుకు దిగిందో ఆడమనిషి.

ఎవరా అని చూస్తే.

సీత... నెవరగంత మీద గాటుతో అందంగా ఉన్న సీత...నాగభూషణంగారి సీత.

అది దాట్ల సుబ్రమణ్యం రాజుగారనే వాళ్ళ మావయ్యగారిల్లట. వాళ్ళమ్మాయి ఇందిర పెళ్ళంటే వచ్చిందంట సీత. తిరిగి రాంపురం రావడానికి ఇంకోవారం పడద్దట తనకి. ఈ వారంలోగా బెన్నిబాబుగాడ్ని చూడకండా ఉండలేక ఇలాగ కబురెట్టిందంట.

గుర్రాలు మేస్తున్న సావిట్లోకెళ్ళిపోయేరిద్దరూ. సందకాడే సీత పట్టుకొచ్చి పడేసిన మిలట్రీ రగ్గు ఒబ్బిడిగా పడుందో మూల. ఠకాల్మని దాన్ని లాక్కుని అందులోకి దూరిపోయేరు.

బయట చలిలో కూర్చున్న నేను "ఆ బెన్నిబాబుగాడ్లో ఏవుందని అంత ఇదయిపోతందీ మనిషి?" అనుకున్నాను. "అసలీ సీతకి జోడీగా సరిపోతాడా ఎదవ? మరెందుకంత ఇష్టం ఆడంటే?" జుట్టు ఎంత పీక్కున్నాను అర్థంగావటం లేదు.

లోపలికెళ్ళిపోయిన ఆళ్ళిద్దరూ తెల్లవారు ఝాము దాకా బయటికి రాలేదు.

బయల్దేరేటప్పుడు బెన్నిబాబుని వెనక్కి పిల్చి ఒక నోట్ల మడత ఆడిజేబులో పెట్టింది సీత. ఆ మనిషి నుదుటి దగ్గరగాటుని చూస్తున్న నాగెడ్డం కింద నవ్వుతా గిల్లింది.

* * *

చాలా సందడిగా ఉంది యానాం రేవు.

గోదావరి పోటు మీదుంది.

ఆ రేవులో మామూలప్పుడు తెల్లనీళ్ళు వర్షాకాలమప్పుడు వరదనీళ్ళు ఉండవు దగ్గర్లో ఉన్న సముద్రం ఎప్పుడూ పొడుస్తా ఉంటది గాబట్టి అక్కడి నీళ్ళెప్పుడూ నీలంగా, ఉప్పగానే ఉంటాయి. ఎదుర్లంక రేవులోంచి అప్పుడే వచ్చి ఆగింది పంటి. టిక్కెట్లు కొనుక్కుని

ఎక్కేం.

కాసేపయ్యేక బయల్దేరిన ఆ పంటి గోదాట్లో వెళ్తుంటే చల్లటిగాలికి దాని మీదెక్కిన ఆడోళ్ళ పైటలూ మగోళ్ళ తలపాగాలూ ఎగిరిపోతున్నాయి.

ఇంకాస్సేపయ్యింది.

పంటి ఎదుర్లంక రేవులో ఆగిందోలేదో దిగిపోవడానికి ప్రతి ఒక్కడికీ తొందరే. రెల్లుగడ్డితో అందంగా నేసిన కాఫీ హోటేలు పాకలు. లంకల్లో పండిన అరిటిపళ్ళ గెలలు వేలాడగట్టిన కిళ్ళీకొట్టూ వరసగా పెట్టిన జట్కా బళ్ళూ అందంగా ఉంది ఎదుర్లంకరేవు.

అప్పుడే బస్సు వెళ్ళిపోడంతో జట్కాబండోళ్ళతో బేరం తెగక దుర్గమ్మగుడి పక్కనే ఉన్న వెంకటేశ్వరా బ్రాంచీ సైకిలు కంపెనీ అని పేరున్న ఆ బ్రాంచి సైకిలు షాపు దగ్గరకెళ్ళి సైకిలొకటి అద్దికి తీసుకున్నాడు బెన్నిబాబు.

నన్ను వెనకాల ఎక్కించుకుని గోదారి ఒడ్డునే తొక్కుకుంటా వెళ్తుంటే ఎదురుగాలి చొక్కా లోపలికెళ్తుంటే బుడగలా ఉబ్బి భలే హాయిగా ఉంది. అదేమాట బెన్నిబాబుతో అంటే ''నీకు బానే ఉంటది నాకు చావు దగ్గర పడ్తంది'' అన్నాడు.

కాస్సేపటికి కొమరిగిరి వచ్చేం.

కిళ్లీకొట్లో తడిసిన ఒట్టిగడ్డిలో పెట్టిన చల్లటిషోడాల్తో ముఖాలు కడుక్కుని పక్కనే ఉన్న హోటేల్లో టీలు తాగి మళ్ళీ బయల్దేరేం.

వూరు దాటి కొంచెం దూరం వెళ్ళాక రోడ్డు పక్కపొలంలో ఏదో గొడవ జరుగుతుంటే సైకిలు దిగి వెళ్ళేం ఒక మనిషిని చెట్టుకి కట్టి కొడ్తన్నారు. వాడు చేసిన తప్పేంలేదట పసుపు పండించేతోటలో ఉచ్చపోసేడు అంతే. ఎన్నో పవిత్రమైన కార్యాలకి వాడతారు పసుపు. అలాంటి పసుపు పండేతోటలో ఇలాంటి పనిచేస్తే ఆడెంత గొప్పోడైనా శిక్ష అలాగే ఉంటదట ఆ ఏరియాలో.

మురమళ్ళదాటేం.

ఎటుపక్కకి చూసినా కొబ్బరితోటలు, వరిచేలు కొన్నిచోట్ల తమలపాకు తోటలు. వెదురుగెడలు దిగేసి వాటికి పాకిస్తున్నారు తమలపాకు తీగల్ని. ఎక్కడచూసినా ఎండపొడ అన్నది లేదు. చల్లటీ చిక్కటీ నీడలు. అసలైన కోనసీమంటే ఇదే. కోనసీమ అందాలంటే అవే.

కొత్తలంక దాటి కొమానపల్లి ఊరు శివార్లో కొచ్చేటప్పటికి చీకటి పడిపోయింది.

వెంకటేశ్వరా బ్రాంచీ సైకిలు కంపెనీవాళ్ళ బ్రాంచికెళ్ళి ఎదుర్లంకలో అద్దెకి తీసుకున్న సైకిలూ, వాళ్లిచ్చిన చీటీ, అద్దీ, ఇచ్చేసి నడుచుకుంటా ఊరు దాటుతుంటే చీకటి పడిపోయింది.

''ఎక్కడికెళ్తున్నాం రా?'' బెన్నిబాబునడిగేను.

''చెపుతానుగానీ నాతోపాటు రా'' అన్నాడు బెన్నిబాబు.

కొంతదూరం నడిచేటప్పటికి రోడ్డుకి ఎడంపక్కన పాతకాలం నాటి సగం పడిపోయిన పెద్ద దూళ్ళసావిడి కనిపించింది. దాంట్లో ఎవరూ లేరు. ఆ సావిడికి అటూ ఇటూ పాకలు కూడా లేవు. సైకిలు మీదెళ్ళిపోతున్న ఒక మనిషిని ''సాగి సూరిబాబురాజుగారి దూళ్ళసావిడి ఇదేనాండి?'' అనడిగేడు బెన్నిబాబు.

సైకిలు దిగకుండానే ''అదే...అదే'' అన్నాడా మనిషి.

నెమ్మదిగా ఆ దూళ్ళ సావిట్లోకెళ్తున్న బెన్నిబాబు వెనకాలే నేనూ వెళ్ళేను.

లోపలికొచ్చిన బెన్నిబాబు దూరంగా ఒట్టిగడ్డిమోపు పడుంటే దాని మీద కూర్చున్నాడు. ఆడ్ని జేర్చి నేనూ కూర్చున్నాను.

బాగా రాత్రయ్యింది.

అలా చీకట్లోకే చూస్తా కూర్చున్న బెన్నిబాబుకి దూరంగా లాంతరు కనిపించే టప్పటికి లేచి నిలబడ్డాడు. వాడితో పాటు నేనూ నిలబడ్డాను.

కాస్సేపటికి ఆ లాంతరు దగ్గరకొచ్చింది. చిలకపచ్చ చీర, కొండమల్లిపూలు పెట్టుకొచ్చిన ఆ ఆడమనిషి, నా దగ్గరకొచ్చి బుగ్గగిల్లి పలకరించింది. ఆ మనిషెవరంటే

సీత... సెవరగంత మీద అందమైన గాటున్న సీత...నాగభూషణంగారి సీత.

తనని దత్తత ఇచ్చిన తల్లి ఒంట్లో బాగో లేదంటే చూడ్డానికొచ్చిందంట. ఇంకా రెండువారాలుంటదట ఇక్కడ.

వాళ్లిద్దరూ దూళ్ళసావిట్లో ఒక మూలకెళ్ళి పోయి దూళ్ళలా కుమ్మేసుకుంటున్నారు అందులో. పెత్తనవంతా సీతదే.

సావిడిబయట దిమ్మమీద చతికిలబడ్డ నాకేం అర్థంగావటం లేదు. ''ఆ బక్క నాకొడుకులో ఏముందని అంతగా ఇదయిపోతుంది సీత? అసలేంటి ఆడిలో గొప్పదనం??'' అసలేం పాలుపోడం లేదు నాకు.

తెల్లవారుఝామున తిరిగొస్తుంటే బెన్నిబాబుగాడి చేతిలో కొన్నిరూపాయినోట్లు పెట్టింది సీత.

* * *

సీత రామచంద్రపురం వచ్చేసింది.

మళ్ళీ మామూలే.

రోజూ చిన్నిబాబుగాడి సైకిలు మీదొ హైస్కూలుగ్రౌండు కెళ్ళడం, కాసేపటికి సీత రావడం. వాళ్ళిద్దరూ అలాచెరుకు తోటల్లోకెళ్ళిపోవడం. నేను పిల్లినాగన్నగాడి చెత్త స్టోరీలు విన్లేక చావడం. రోజులలాగ గడిచిపోతున్నాయి.

ఆ సీతంటే చాలా చిన్నచూపు ఏర్పడిపోయింది నాకు. మనిషిమీద ఏమాత్రం మర్యాద లేకుండా పోయింది. ''మనవూ ఓసారి ట్రైజేస్తే నష్టమేంటి. ఎట్టి పరిస్థితుల్లో కాదనదు ఆ మదపిచ్చిది'' అనేసుకున్నాను.

ఒకరోజు చిన్నిబాబుగాడికి జ్వరం వచ్చింది.

ఈ టైంలో మాబాగా వచ్చిందనుకున్నాను.

నాకు కబురంపి ''తనకి చెప్పి రారా'' అన్నాడు.

రాత్రయ్యేక అక్కడికెళ్ళిన నేను సీతని చెరుకుతోట లోపలికి తీసుకెళ్ళి బెన్నిబాబుగాడికి జ్వరమొచ్చిన విషయం చెప్పి... నా విషయం చెప్పడానికి కాస్సేపు నాన్చి చివరికి చెప్పేసేను. ''నువ్వంటే నాకిష్టం'' అని.

నవ్వింది సీత.

''బెన్నిబాబు గాడుంటున్నాడని చెప్పలేకపోయేను... నువ్వంటే మొదట్నుంచీ ఇష్టమే నాకు'' అంటా దగ్గరకెళ్ళి జబ్బమీద

చెయ్యెయ్యబోతుంటే మళ్ళీ నవ్వేసిన సీత కొంచెం ఆగు అని సైగచేసి కాస్సేపయ్యేకా ''నేనా బెన్నిబాబుకోసం పడి చస్తున్నానని నన్ను లోకువ గడున్నావు గదా?'' అంది.

మాటాడ్లేదు నేను.

''నేను బెన్నిబాబులో ఏదో చూసేను. బోల్డంత ఇష్టపడ్డాను. అతనికోసం ఎగబడ్తున్నాను. కేవలం బెన్నిబాబుకోసమే పడిచస్తున్నాను. బెన్నిబాబుకోసం ఇప్పుడు చచ్చిపొమ్మంటే చచ్చిపోతాను. మహామహులొచ్చినా నాకు బెన్నిబాబే గొప్ప. నాకేకాదు ప్రతి ఆడదానికీ జన్మలో ఒక మగాడే గొప్పగా అనతాడు. అతనికోసం నేనిలా తాపత్రయపడ్తున్నానని నువ్వు నన్ను లోకువగట్టడం చాలా తప్పు. నాకు సరిగ్గా మాట్టాడ్డం రాడం లేదుగానీ నా మాటల్లో చాలా లోతుంది. ఈ రాత్రి నిద్రోయేటప్పుడు నేనన్నమాటలు ఒకసారి గుర్తు చేసుకుని బాగా ఆలోచిస్తే నీకే అర్థమవుద్ది'' అనేసెళ్ళిపోయింది సీత.

ఆ రాత్రేగాదు చాలా రాత్రుళ్ళు ఆలోచించిన నాకు చాలా అర్థమయింది.

నా ఆలోచనల్లో మార్పొచ్చింది. ఆ తర్వాత ఇంకెప్పుడూ సీతని ఆదృష్టితో చూడని నేను అప్పుడప్పుడూ అనుకుంటుంటాను. ''చంద్రుడికి ఆ మచ్చ ఉండటం వల్లే అందం వచ్చింది. సీత నెవరగంత మీద ఆ గాటు వల్లే అందంగా ఉంది...సీత శీలానికి మచ్చవల్లే సీత అందం'' అని.

* * *